

హైదరాబాద్ వార్త



# తుక్కు పాలసీ తుస్సు!

**-నగరంలో భారీగా కాలం చెల్లిన బండ్లు**
**-వాహనదారుల నుంచి కొరవడిన స్పందన**
**-పాతవాటిని వదులుకోవడంపై నిరాసక్తత**
**-ప్రోత్సాహకాలు కల్పిస్తామన్నా పట్టించుకోని వైనం**



**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త**

కాలం చెల్లిన వాహనాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తుక్కు పాలసీ తుస్సుమంటోంది. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చే వాహనదారులకు రవాణాశాఖ సముచితమైన ప్రోత్సాహకాలను ప్రకటించినా వాహనదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. ఢిల్లీ వంటి నగరాల్లో కాలం చెల్లిన వాహనాలపై నిర్భంధంగా నిషేధం విధిస్తున్నారు. హైదరాబాద్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు ప్రత్యేక కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం ఒక నెల వ్యవధిలో కనీసం 25 వాహనాలు కూడా తుక్కు కావడం లేదని అధికారులు చెబుతున్నారు. తుక్కు బండ్లు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ పొగలు చిమ్ముతున్నాయి. ప్రమాదకరమైన సల్ఫర్, కార్మనో మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి.

**వ్యక్తిగత వాహనాలే టాప్...**

-నగరంలో 15 ఏళ్లు దాటిన వాటిలో వ్యక్తిగత వాహనాలే టాప్‌లో ఉన్నాయి. రవాణా శాఖ లెక్కల ప్రకారం సుమారు 17 లక్షల బైక్లు, మరో 3.5 లక్షల కార్లు తిరుగుతున్నాయి. రవాణా వాహనాల కేటగిరీలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, ఆటోలు తదితర వాహనాలు సైతం కాల పరిమితి ముగిసిన తర్వాత కూడా వినియోగంలో ఉన్నాయి. ఇవి కాకుండా మరో లక్ష వరకు సరుకు రవాణా వాహనాలు ఉన్నట్లు అంచనా గ్రేటర్లో 13 వేలకుపైగా స్కూల్ వాహనాలు ఉంటే వాటిలో 2500 వరకు డొక్కు బస్సులే.

-సుమారు 1.4 లక్షల ఆటోరిక్షాల్లో కనీసం 25 వేలకు పైగా కాలం చెల్లినవే. ఇవి కాకుండా వెయ్యికి పైగా ఆర్టీసీ బస్సులు, 4 వేల మ్యాక్సీ క్యాబ్లు ఉన్నాయి. ఇటు వ్యక్తిగత వాహనాలు, అటు రవాణా వాహనాలు అన్నీ కలిపి 25 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ఈ వాహనాల నుంచి వెలువడే కాలుష్య కారకాల్లో పీఎం స్థాయి 2.5 శాతం వరకు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాహనాల కండీషన్ బాగా లేకపోవడం వల్ల, ఇంజన్ దెబ్బతినడం, బ్రేకులు ఫెయిల్ కావడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

**గ్రీన్ ట్యాక్స్ చెల్లిస్తే సరి..**

-మోటారు వాహన చట్టం ప్రకారం 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలు గ్రీన్ ట్యాక్స్ చెల్లించి మరో 5 ఏళ్ల వరకు రెన్యువల్ చేసుకోవచ్చు. 20 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాలకు సైతం రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ సదుపాయం ఉంది.

-ఈ వెసులుబాటుతో స్వచ్ఛంద స్క్రాపింగ్‌కు స్పందన రావడం లేదు. చాలామంది రెండో వాహనం ఉన్నప్పటికీ మొదటి వాహనాన్ని వదులుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఒక ఇంట్లో ఒక పాత కారు, ఒక కొత్త కారు తప్పనిసరి అవసరంగా వినియోగిస్తున్నారు.

-ద్విచక్ర వాహనాల విషయంలోనూ పాతవి, కొత్తవి ఉంటున్నాయి. కానీ పాతవాటిని మాత్రం వదులుకోవడం లేదు.

**ప్రోత్సాహకాలు ఇలా..**

-కాలపరిమితి ముగిసిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చుకొనే వాహనదారులకు కొత్త వాటి కొనుగోళ్లలో ప్రభుత్వం సముచితమైన ప్రోత్సాహాన్ని అందజేస్తుంది.

-కొత్త వాహనాల జీవితకాల పన్నులో రాయితీని ఇస్తున్నారు.

-రూ.5 లక్షల విలువైన వాహనాల కొనుగోలుపై రూ.10 వేల రాయితీ ఉంటుంది.

-రూ.5-10 లక్షల ఖరీదైన వాహనాలపై రూ.20,000

-రూ.10-15 లక్షల ఖరీదు చేసేవాటిపై రూ.30,000

-రూ.15-20 లక్షల వరకు విలువైన వాహనాలను కొనుగోలు చేస్తే రూ.40,000 చొప్పున రాయితీ ఇస్తారు.

-తమ పాత వాహనాల తుక్కు సర్టిఫికెట్‌లను ఆర్టీఏలో అందజేస్తే ఈ రాయితీ లభిస్తుంది.





## నగరాన్ని కమ్మేసిన పొగ మంచు

హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త : భాగ్యనగర వీధులు, రోడ్లు ఢిల్లీని తలపించాయి. నగరాన్ని మంచు దుప్పటి కప్పేయడంతో శుక్రవారం ఉదయం 9 గంటలు దాటినా పొగ మంచు వీడలేదు. నగరంలో దట్టమైన మంచు కురవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొగమంచు ప్రభావంతో జనం బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు.తెల్లవారు జామునుంచే దట్టంగా పొగ మంచుకమ్మేయడంతో ..రోడ్లు కనిపించక వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. ఓ వైపు చలి..మరో వైపు దట్టమైన మంచుతో చోదకులు ఇబ్బందిపడ్డారు.హైదరాబాద్-విజయవాడ, వరంగల్, కరీంనగర్, కర్నూల్ జాతీయ రహదారుల్లో వాహనాలకు హెడ్‌లైట్లు వేసుకొని స్లోగా మూవ్ అయ్యాయి.

## నేటి నుంచి టెట్ పరీక్ష

**-జిల్లాలో 4సెంటర్లు 9539 మంది అభ్యర్థులు**
**-అభ్యర్థులు సమయానికి కేంద్రానికి చేరుకోవాలి**
**-జిల్లా రెవిన్యూ అధికారి వెంకటాచారి**



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

**హైదరాబాద్, జనవరి 2,ప్రభాతవార్త:**

టెట్ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి ఈ వెంకటాచారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రేపటినుండి జరగనున్న తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ పరీక్ష నిర్వాహణపై జరిగిన సమన్వయ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఈ వెంకటాచారి పాల్గొని పరీక్ష ఏర్పాట్లపై అధికారులకు నిర్వహణ పై సూచనలు అందించారు. టెట్‌పరీక్షలు ఈనెల 3నుంచి 20వ తేదీ మధ్యలో మొత్తం 9 రోజులలో, 15 సెషన్లలో (ఉదయం: 9:00 -11:30 అలాగే మధ్యాహ్నం: 2:00 - 4:30 వరకు జరగనుందని, ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష అని తెలిపారు. ఈ పరీక్షకై జిల్లాలో 4 సెంటర్లు కేటాయించగా అందులో మొత్తం 9539 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు.ఉదయం పరీక్షకు 7:30 నుండి, అలాగే మధ్యాహ్నం పరీక్షకు 12:30 నుండి కేంద్రంలోకి అనుమతించబడతారని తెలిపారు. పరీక్షా సమయానికి 10 నిమిషాల ముందే కేంద్రం గేట్లు మూసివేయబడతాయని తెలిపారు. పరీక్ష రాయడంలో ఏవైనా అక్రమాలకు పాల్పడితే అభ్యర్థిని డిబార్ చెయ్యడం జరుగుతుందని, అలాగే క్యాల్కులేటర్, మొబైల్ ఫోన్, ఇతర ఎలెక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. అనంతరం పరీక్షను అభ్యర్థులకు ఏ ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించాలని తెలుపుతూ డిప్యూటీ డి.ఈ ఓలు, అలాగే డిప్యూటీ డి.ఐ.ఈ. ఓ లకు, అలాగే లైన్ డిపార్ట్మెంట్లకు పలు సూచనలు అందించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష అయినందున నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను సూచించారు. అలాగే రవాణా, పోలీస్ మరియు వైద్యారోగ్య శాఖాధికారులకు తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా విద్యాధికారి, టి. ఉషారాణి, ఎ.సి.పి యాకుబ్ రెడ్డి, డిప్యూటీ డి.ఈ.ఓలు, డిప్యూటీ డి.ఐ.ఈ.ఓలు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆటో డ్రైవర్ల 'అసెంబ్లీ ముట్టడి'



సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**సైఫాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి విఫలమైనందుకు నిరసనగా ఈ నెల 3వ తేదీన వేలాది మంది ఆటో డ్రైవర్లతో 'అసెంబ్లీ-ముట్టడి' ఆందోళన కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ ఆటో రికా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుంచి ఆటో మీటర్‌కు చార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్ ప్రయాయణం మహలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు బాడుగలు (కిరాయిలు) లేక తీవ్రంగా నష్టపోయారని, దీంతోపాటు 100 శాతం పెరిగిన పెట్రోల్, డిజీల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలతో ఆటో డ్రైవర్లలో అకలి కేకలు మొదలై నానా ఇబ్బందులకు గుర్తైనారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు ఆనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. శనివారం జరిగే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు వేముల మారయ్య, ఎంఎ సలీం, ప్రవీణ్, ఎ.సత్తిరెడ్డి, పి.యాదగిరి, శివానందం, బాబా తదితరులు పాల్గొన్నారు.

## గోపన్‌పల్లిలో మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

**-పలువురికి గాయాలు .. కేసు నమోదు**

**గచ్చిబౌలి, జనవరి 2 ప్రభాతవార్త :** మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదం గోపన్‌పల్లిలో దాడుల వరకు వెళ్లింది. బెల్టుషాపులో మద్యం బాటిల్ మీద ఎక్కువ ధర అడిగినందుకు చెలరేగిన వివాదం పరస్పర ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో పలువురికి గాయాలు కాగా, బెల్టుషాపు ధ్వంసమైంది. దీనిపై పోలీసులు ఇరువర్గాల మీద కేసులు నమోదు చేశారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపన్‌పల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...గోపన్‌పల్లి తాండాలో ఉన్న బెల్టుషాపు వద్దకు మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు గురువారం అర్థరాత్రి 2 గంటల ప్రాంతంలో వచ్చి మద్యం అడిగారు. బీరు బాటిళ్లు తీసుకున్న తరువాత మద్యం సీసా మీద షాపు యజమాని ధర ఎక్కువగా అడుగడం వివాదానికి కారణమైంది. దీంతో మద్యం మత్తులో ఉన్న యువకులు, బెల్టుషాపు యజమాని మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో బెల్టుషాపు యజమాని తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అతని కుమారుడు, మరో ముగ్గురు యువకులు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ పెరిగి దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో బెల్టుషాపు ధ్వంసం కాగా, నలుగురు యువకులకు తలపై గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అందులో ఓ యువకుడి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. కాగా ఈ ఘటనపై చందానగర్ పోలీసులు ఇరువర్గాల మీద కేసులు నమోదు చేశారు. యువకుల మీద దాడి చేసిన బెల్టుషాపు యజమాని ప్రకాశ్‌సింగ్, అతని అనుచరులతో పాటు బెల్టుషాపు మీద దాడి చేసి ధ్వంస చేయడంతో పాటు దాడి చేసిన సురేందర్ అతని అనుచరుల మీద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మద్యం మత్తులో గొడవ...కొడవలితో దాడి

**జూబ్లీహిల్స్, జనవరి 2, ప్రభాతవార్త:** మద్య మత్తులో గొడవ పడి ఇంటికి వెళ్లి కొడవలితో దాడి చేసిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని ఎస్వీ వైన్స్‌లో వెంకటగిరిలో నివసించే వాచ్‌మెన్ మనోజ్, మాదాపూర్ బస్తీలో నివసించే ఆటో డ్రైవర్ రాకేష్(30) ఇద్దరు మద్యం సేవించే సమయంలో గొడవ పడ్డారు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. చూసుకుందాం అంటూ ఇద్దరు సవాళ్లు విసురుకున్నారు. దుర్భాషలాడుకున్నారు. కాగా మనోజ్ ఇంటికి వెళ్లగా అతన్ని అనుసరించిన రాకేష్ తనతోపాటు తీసుకొచ్చిన కొడవలితో మనోజ్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో మనోజ్‌కు తీవ్ర గాయలయ్యాయి. మనోజ్ కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో రాకేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. మనోజ్‌కు దాదాపు 15 కుట్లు పడ్డాయి. మనోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు రాకేష్‌పై హత్యాయత్నం సెక్షన్ 109తోపాటు 118(1) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి

**మలక్ పేట, జనవరి 2, ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మలక్ పేట ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన తిరుపతిరావు, వెంకటమ్మ దంపతులు దిల్ సుఖ్ నగర్ కొత్తపేటలో కుమార్తెను చూసేందుకు వచ్చారు. గురువారం రాత్రి కూతురు యాక్టివా పై ట్యాంక్ బండ్ చూసేందుకు భార్యాభర్తలిద్దరూ బయలుదేరారు. మూసారాంబాగ్ హైటెక్ గార్డెన్ సమీపంలో వెనుకగా వేగంగా వచ్చిన దిల్ సుఖ్ నగర్ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఓవర్ టెక్ చేయబోయి యాక్టివా వాహనానికి తగిలింది. దీంతో భార్య భర్తలు ఇద్దరూ బస్సు కింద పడి పోవడంతో బస్సు వెనకి టైరు వారిపై నుంచి వెల్లడంతో భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు మలక్ పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

## వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

**: జిల్లా రవాణాశాఖ అధికారి రఘునందన్ గౌడ్**



వాహనదారులకు రోడ్డు సేఫ్టీపై సుచనలు ఇస్తున్న సాధుల శ్రీనివాస్

**పేట్ బషీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త**

వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని జిల్లా రవాణాశాఖ అధికారి రఘునందన్ గౌడ్ అన్నారు. శుక్రవారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా రవాణాశాఖ అధికారి రఘునందన్ గౌడ్, సిబ్బంది వాహనదారులకు తగు సూచనలు అందించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద క్రమశిక్షణగా ఉండాలని సూచించారు. నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అలర్ట్‌గా ఉండాలన్నారు. వాహనదారులు ఇంటి నుండి బయలుదేరేటప్పుడు తన కుటుంబం తన కోసం ఎదురుచూస్తుందని గుర్తించుకుని ప్రయాణం సాగించాలన్నారు. ప్రతీ ఒక్క డ్రైవర్, క్లీనర్ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొని ట్రాఫిక్ రూల్స్ గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెహికల్ ఇన్స్‌పెక్టర్ సాధుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

### ప్రశాంత్ నగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 2, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లో మూసి ఉన్న దుకాణంలో విద్యుత్ ఘాతం ఏర్పడి దుకాణంలో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలను ఆర్పి వేయడంతో పెద్ద ఎత్తున ప్రమాదం తప్పినట్లు స్థానికులు పేర్కొన్నారు. మూసివేసి ఉన్న దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## గుండెలకు హత్తుకోవాల్సిన వారే ఊపిరి తీస్తున్నారు

**పసి మొగ్గలను చిదిమేయడం పిరికితనం, క్షమించరాని నేరం : సిపి సజ్జనార్**



**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త :**

రెండు వేర్వేరు ఘటనల్లో ఓ మహిళ, మరో వ్యక్తి తమ పిల్లలకు విషమిచ్చి చంపినట్లు వచ్చిన కథనాలపై నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ స్పందించారు. ఇటీవల తల్లిదండ్రులు పిల్లలను హతమారుస్తున్న ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల ప్రాణాలు తీయడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బతికి గెలవాలని.. పారిపోయి ఓడిపోవద్దని సూచించారు.'నూతన సంవత్సర వెలుగులు చూడాల్సిన కళ్లు..శాశ్వతంగా మూసుకుపోయా యి. గోరుముద్దలు తినిపించాల్సిన చేతులే విషం కలిపాయి. గుండెలకు హత్తుకోవాల్సిన వారే ఊపిరి తీశారు. అమృతం లాంటి ప్రేమను పంచాల్సిన తల్లిదండ్రులే ఇలా మారితే ఆ పసిప్రాణాలు ఎవరికి చెప్పుకోగలవు? నాన్న ఇచ్చిన పాలలో విషం ఉందని ఆ చిన్నారులకు ఏం తెలుసు? అమ్మ కొంగు ఉరి తాడవుతుందని ఆ అమాయకులకు ఏం ఎరుక? కష్టాలు సునామీలా వచ్చినా సరే.. ఎదురీదాలే తప్ప, ఇలా పసి మొగ్గలను చిదిమేయడం పిరికితనం, పాపం, క్షమించరాని నేరం. చనిపోవడానికి ఉన్న ధైర్యం..బతకడానికి, పోరాడటానికి ఎందుకు సరిపోవడం లేదు? ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. అది మీపై ఆధారపడ్డ వారికి తీరని ద్రోహం. దయచేసి ఆలోచించండి. క్షణికావేశంలో నూరేళ్ల జీవితాన్ని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి. బతికి గెలవండి. పారిపోయి ఓడిపోవద్దు' అంటూ సజ్జనార్ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలకు పాల్పడవద్దని సూచించారు.

భర్త ఆకస్మిక మరణంతో మనోవేదనకు గురైన నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రసన్న అనే మహిళ న్యూ ఇయర్ రోజున తన ఇద్దరు పిల్లలకు విషపూరిత ఆహారం తినిపించి.. తానూ తిన్నది. దీంతో ప్రసన్న, ఆమె కుమార్తె మేఘన (13) మృతి చెందగా.. కుమారుడు ఆశ్రితామ్(15) పరిస్థితి విషమంగా ఉంది. మరో ఘటనలో నంద్యాలకు చెందిన సురేంద్ర అనే వ్యక్తి భార్య చనిపోయిందనే ఆవేదనలో తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి.. తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. న్యూ ఇయర్ రోజున శీతల పానీయాలు, పాలలో విషం కలిపి తన పిల్లలకు కావ్యశ్రీ(7), ధ్యానేశ్వరి(4), సూర్యగగన్ (2)లకు తాగించి..తాను ఉరివేసుకున్నాడు.

## లింక్ బ్రిడ్జి ప్రాజెక్టును ప్రభుత్వం ప్రాధాన్యతతో పూర్తి చేసింది : మంత్రి పొన్నం ప్రభాకర్



లింక్ బ్రిడ్జి ను ప్రారంభిస్తున్న జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి & ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు పావని వినయ్ కుమార్, రచనశ్రీ తదితరులు

**చిక్కడపల్లి జనవరి 2 ( ప్రభాతవార్త ) :** నగర మౌలిక సదుపాయాల మెరుగుదలలో భాగంగా లింక్ బ్రిడ్జి ప్రాజెక్టును ప్రభుత్వం ప్రాధాన్యతతో పూర్తి చేసిందని రాష్ట్ర రవాణా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ట్రాఫిక్ కష్టాలను తీర్చే క్రమంలో భాగంగా, చిక్కడపల్లి దోమలగూడ మధ్య హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలాపై జీహెచ్‌ఎంసీ సుమారు రూ. 6 కోట్ల నిధులతో నిర్మించిన నూతన లింక్ బ్రిడ్జిని శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ లింక్ బ్రిడ్జి అందుబాటులోకి రావడం వల్ల అశోక్ నగర్, సిటీ సెంట్రల్ లైబ్రరీ , ఏవీ కాలేజీ (గగన్‌మహల్) ప్రాంతాల మధ్య ఈ వంతెన ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరుస్తుందని, అంతేకాకుండా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ లింక్ రోడ్డు ద్వారా నగరంలోని కేంద్ర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందన్నారు. ప్రజా సౌకర్యం గురించి ప్రస్తావిస్తూ విద్యార్థులు, ఉద్యోగులు , స్థానిక ప్రజలకు ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. చిక్కడపల్లి, దోమలగూడ, వివేకానంద నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం సులభతరం కావడమే కాకుండా, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్ , గాంధీనగర్, కవాడిగూడ కార్పొరేటర్లు పావని వినయ్ కుమార్, రచనశ్రీ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న రామకృష్ణ నాట్యమండలి నాటక ప్రదర్శనలు



శ్రీకృష్ణ ఆంజనేయ నాటకంలో ఒక దృశ్యం

**నాంపల్లి, జనవరి 2 ప్రభాతవార్త :** అతిపవిత్ర వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శ్రీ దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ రామకృష్ణ నాట్యమండలి సేవాసంస్థ నిర్వహణలో అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడిన శ్రీకృష్ణ ఆంజనేయ, సతీసక్కుబాయి, మయసభ పౌరాణిక నాటక ప్రదర్శనలు సభికులకు ఆసక్తికరంగా రక్తికట్టించి ఎంతగానో ఆకట్టుకుని ఆహ్లాదపరిచాయి. ముఖ్యంగా సక్కుబాయిగా గంధం రాజేశ్వరి, కృష్ణుడుగా బి.కాటం రాజు అద్భుత నటనతో రంజింపజేశారు. శ్రీకృష్ణ ఆంజనేయలో కృష్ణుడుగా జొన్నలగడ్డ జగన్‌మోహన్‌రావు, ఆంజనేయుడుగా బి.నారాయణస్వామి, రుక్మిణిగా రాజేశ్వరి నటనతో కట్టిపారేశారు. మయసభలో దుర్యోధనుడుగా పుచ్చా సాంబశివరెడ్డి నటన వర్ణనాతీతం. ఈ నాటకాలకు జొన్నలగడ్డ శ్రవణ్‌కుమార్ హార్మోనియం, వీరబ్రహ్మం డోలక్‌తో అద్భుత సంగీతం చేకూర్చి నాటకాల ను మరింత రక్తికట్టించారు. బి.పరమేశ్ ఆహార్యం పాత్రోచితం. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి శ్రీనివాసాచారి, మొవ్వ దేవనాథసూరి, జంగయ్యగౌడ్ తదితరులు అతిథులుగా పాల్గొని నాటక ప్రదర్శనల్లోని కళాకారులను ఘనంగా సన్మానించి ఎంతగానో అభినందించారు.

## దివ్యాంగులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి : డిసిపి



జెబిఎస్ సమీపంలోని స్వీకార్ కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న డిసిపి రష్మి పెరుమాల్

**కంటోన్మెంట్,జనవరి 2 ప్రభాతవార్త:** దివ్యాంగులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజ అభివృద్ధికి పాటుపడాలని ఉత్తర మండలం డిసిపి సాధన రష్మి పెరుమాల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలోని స్వీకార్ ఉప్‌కార్ కేంద్రంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డెఫ్ అండ్ డమ్,మానసిక వికలాంగులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా 284 మంది విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేశ్, డిఐ శ్రీశైలం నాయక్, ఎస్ఐ తిరుపతి, స్వీకార్ సంస్థ కో .. ఆర్డినేటర్ డాక్టర్ పి.హన్మంత్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ధన్‌రాజ్



ఆంగ్లనామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు,మాజీ సెట్విన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్

**అఫ్జల్‌గంజ్,జనవరి 2 ప్రభాతవార్త:** ఆంగ్లనామ 2026 సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలసి బొకె అందచేసి శాలువ కప్పి సన్మానం చేసి గోషామహల్ నియోజకవర్గం సీనియర్ నాయకులు,మాజీ సెట్విన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్ఈకార్యక్రమంలో సతీష్,మెడికొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ



హెల్మెట్స్ అందజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 2, ప్రభాతవార్త**

జాతీయ రహదారి భద్రతా మాసంలో భాగంగా సైబరాబాద్, కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ఉన్నత అధికారుల ఆధ్వర్యంలో వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఎస్సీ ఎస్సీ వారి సౌజన్యంతో శ్రీహర్ష ఫౌండేషన్ సహకారంతో సౌత్ ఇండియా షాపింగ్ మాల్, కూకట్‌పల్లిలలో వాహనదారులకు హెల్మెట్ల అవశ్యకతను వివరించి తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని చైతన్య పరుస్తూ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం మేడ్చల్ ఎడిసిపి వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసిపి వెంకయ్య, కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ తిమ్మప్ప, ఆర్ ఐ. జంగయ్య, హర్ష ఫౌండర్ హిమబిందు, ఎస్సీ ఎస్సీ సభ్యులు మహేష్, వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల బలోపేతానికి ఎస్‌బిఐ బ్యాంక్ కృషి



చిన్నారులకు బుక్స్, పెన్సిల్ కిట్స్ అందజేసిన దృశ్యం

**మియాపూర్, జనవరి 2, ప్రభాతవార్త;**

అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చిందని ఎస్.బి.ఐ కొత్తగూడ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ బాలరాజ్ అన్నారు. శుక్రవారం ఎస్.బి.ఐ పాన్ ఇండియా సిఎస్ఆర్ నిధుల కింద ఐసిడిఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు పరిధిలో గల ఆదిత్య నగర్ అంగన్వాడి కేంద్ర 1 లోని చిన్నారులకు ఎల్.ఈ.డి టీవీ, రైస్ కుక్కర్, వాటర్ ఫిల్టర్, సెల్ఫ్ రాక్, గడియారం, ఆట వస్తువులు, స్కూల్ బ్యా, వాటర్ బాటిల్స్, గ్లాసులు, ప్లేట్లు, గిన్నెలు, స్కెచ్ పెన్సు, బుక్స్, పెన్సిల్ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో ఆధునిక సదుపాయాలను సమకూర్చేందుకు ఎస్.బి.ఐ ఫ్యాన్ ఇండియా ముందుకు రావాడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు మానసికంగా శారీరకంగా ఎదిగేందుకు అవసరమైన సదుపాయాలను సిఎస్ఆర్ నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు ఆఫీసర్ కవిత, ఆదిత్య నగర్ సెక్టర్ సూపర్వైజర్ కోమల బాయ్, అంగన్వాడీ టీచర్ పవిత్ర, సహాయకురాలు సుజాత పాల్గొన్నారు.

# ఆర్టీసి బస్సు ప్రయాణం సురక్షితం : డిఎం

**- ఆనందం వ్యక్తం చేసిన కాలనీల ప్రజలు**



మణికొండ అల్కాపూర్ కాలనీలో ఆర్టీసి బస్‌ను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ వెంకట కృష్ణమూర్తి.

**నార్సింగి, జనవరి 2 ప్రభాతవార్త :** ప్రజా రవాణా వ్యవస్థలో అగ్రగామిగా ఉన్న ఆర్టీసి బస్సులో ప్రయాణం సురక్షితమని మెహిదీపట్నం డిపో మేనేజర్ వెంకట కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్ నుంచి సికింద్రాబాద్, కోఠీ ప్రాంతాలకు వెళ్లేందుకు కొత్త బస్సు రూట్‌ను ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ అధ్యక్షులు అర్వపల్లి వంశీతో కలిసి డిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ ప్రజలంతా ప్రైవేటు వాహనాలలో కాకుండా సురక్షితమైన ఆర్టీసి బస్సులలోనే ప్రయాణించాలని సూచించారు. సమయానికి బస్సులను నడుపుతామని, ప్రజలు, ప్రయాణీకులు ఆదరించాలని పేర్కొన్నారు. అనంతరం అధ్యక్షులు వంశీ మాట్లాడుతూ అనేకమార్లు ఆర్టీసి బస్సులు నడుపాలని ఆర్టీసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, ఇన్నాళ్ళకు కొత్త బస్సులు ప్రారంభం అవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు నిత్యం ఈ బస్సులలో ప్రయాణిస్తేనే ఆర్టీసి ఈ సర్వీసులను కొనసాగిస్తుందని, ప్రయాణీకులు లేకుంటే నష్టాలు వచ్చి బస్సులను నిలిపివేసే ప్రమాదం ఉందన్నారు. రాయదుర్గంలోని మెట్రో స్టేషన్‌కు కనెక్టివిటీ ఇచ్చేలా చూడాలని ఆర్టీసి అధికారులను కోరుతున్నామని తెలిపారు. కాలనీ ప్రజలతో పాటు వివిధ పనులపై ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారంతా ఈ కొత్త బస్సుల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎటిఆర్‌డబ్ల్యుఎ ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్‌దేవ్, శశి, సభ్యులు శ్రీధర్, ప్రదీప్, మహేంద్రాచారి, పవన్, ఎన్‌వియస్‌ఎస్ శర్మ, వెంకట్‌రాములు, రాజు, కిషన్‌రావ్, పట్నాయక్, గోవర్ధన్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం : మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



రక్తదాన శిబిరంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బిజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తధితరులు

**తార్నాక, జనవరి 2 ప్రభాతవార్త :** రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం దానం చేసి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు సతీమణి సావిత్రిబాయి 62 వ జయంతి సందర్భంగా నారపురాజు సావిత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార్నాకలోని తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో జరిగిన బ్లడ్ డొనేషన్ క్యాంపును బిజెపి చీఫ్ రామచంద్ర రావు తో కలిసి దత్తాత్రేయ ప్రారంభించారు. ఈ సందర్భంగా హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తో కలిసి రక్తదాన శిబిరాన్ని సందర్శించి, రక్తదాతలను అభినందించారు. సేవ, కరుణ, మానవత్వం అనే విలువలతో జీవితాన్ని గడిపిన సావిత్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ, ఈ కార్యక్రమం తనకు ఎంతో భావోద్వేగభరితమైన క్షణమని ఎన్. రాంచందర్ రావు తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతి రక్తదాతకు రూ.5 లక్షల విలువైన ఉచిత బీమా పాలసీని అందించడం విశేషం. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే ఈ మహత్తర కార్యక్రమం సమాజానికి సేవా భావనపై శక్తివంతమైన సందేశాన్ని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి,డా, మోహన్ రావు, నాయకులు బండ చంద్రారెడ్డి, రవినాయక్, నాగేశ్వర్ రెడ్డి, కొన్నె సంపత్, వీరన్న, ఉపేందర్ యాదవ్, వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మంచి సంగీతంతోనే మానసిక ప్రశాంతత : సముద్రాల వేణుగోపాల చారి



ప్రముఖ వీణ విద్వాన్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ ఏ.ఎస్.మాధవి లను సత్కరిస్తున్న మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి

**చిక్కడపల్లి జనవరి 2 ( ప్రభాతవార్త ) :** మంచి సంగీతం మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదిక లో బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ అధినేత, ప్రముఖ గాయకుడు టి.రామోజీ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వీణ విద్వాన్, ఇంటర్నేషల్ వండర్ బుక్ అఫ్ రికార్డు హోల్డర్ ఏ.ఎస్.మాధవి సంగీత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి రాందాస్ తేజావత్, సంఘసేవకురాలు పిపిపి అంజనీ కుమారి, తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్ చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మి శాంతి తదితరులు పాల్గొనగా సాంఘిక , సాంస్కృతిక సేవరత్న పురస్కారాలను డాక్టర్ మేడిది వెంకటేశ్వర్ రావు, ప్రదీప్ చంద్ర లకు అందించి గౌరవించారు. రామోజీ స్వరసారధ్యంలో గాయని గాయకులు ఆర్.రవిబాబు, ప్రదీప్ చంద్ర, వెంకట్ రావు, జె.వెంకటేష్, ప్రకాష్, శ్యామ్ బాబు, కె.ప్రసాద్ రావు, టి.వాసు, సాయి అవినాష్, వై.శారద, శ్రీలక్ష్మి, రాణి, భాగ్యలక్ష్మి, నాగశిరిషా, సరితా, జ్యోతి, ప్రణీత, అనురాధ, సుష్మిత తదితరులు అద్భుతంగా గానం చేసారు.

## మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని వినతి



మురుగునీటితో నిరసన తెలుపుతున్న స్థానికులు

**పేట్ బషీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పద్మానగర్ డివిజన్ వాజ్పాయ్ నగర్‌లో గత రెండు నెలలుగా తాగు నీటిలో మురుగు నీరు సరఫరా అవుతుందని, నీటిని వదిలిన మొదటి అరగంట, బంద్ చేసే చివరి అరగంట మురుగు నీరు సరఫరా అవడంతో పాటు దుర్వాసన వస్తుందని శుక్రవారం వాజపేయి నగర్లో స్థానికులు మురుగు నీటిని బాటిల్‌లో పట్టుకుని నిరసన తెలుపారు. బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్ మద్దతుగా నిలిచారు. ఈ నిరసన అనంతరం స్థానికులందరితో చింతల్‌లోని జల మండలి కార్యాలయానికి వెళ్లి మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమేశ్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు వద్దకే ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కనీస అవసరమైన తాగు నీటినే సరిగా సరఫరా చేయలేక పోతుందన్నారు. మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూపకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానిక మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి



ఆర్టీఓ అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేస్తున్న భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి

**చిక్కడపల్లి డిసెంబర్ 24 (ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మరియు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కొరకు ఆటో సంఘాలతో చర్చలు జరపాలని బియంయస్ అనుబంధ తెలంగాణ స్టేట్ ఆటో ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. శుక్రవారం రవాణా శాఖ కమీషనర్ కార్యాలయంలో జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్, ఖైరతాబాద్ ఆర్టీఓ పురుషోత్తం రెడ్డి ని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి నేతృత్వంలో బృందం కలసి వినతిపత్రం సమర్పించారు. ఆర్టీఓ ను కలిసిన వారిలో బియంయస్ ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పెంటయ్య గౌడ్, తెలంగాణ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.డి హబీబ్ , ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ రెడ్డి లు ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రవహించిన గొప్ప వ్యక్తి రమణారెడ్డి : సిఎం రేవంత్ రెడ్డి




ఎం.వి. రమణారెడ్డి కళాత్మక జీవన ప్రస్థానం ఉద్యమశిల్పి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ జనవరి 2 ప్రభాతవార్త :** ప్రముఖ శిల్పి, కళాకారుడు ఎం. వి. రమణారెడ్డి కళాత్మక జీవన ప్రస్థానం ఖిఉద్యమశిల్పిఖి పుస్తకావిష్కరణ సభ గురువారం రాత్రి ప్రజాభవన్ లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరై ఈ గ్రంథాన్ని ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. తెలంగాణ గ్రామీణ మధ్యతరగతి రైతు కుటుంబం నుండి మొదలైన ప్రఖ్యాత కళాకారుడు రమణారెడ్డి జీవన ప్రస్థానమే ఖిఉద్యమశిల్పిఖి పుస్తకం అని రేవంత్ రెడ్డి అన్నారు. అయన ప్రస్థానం ఖండాంతరాలు దాటి, తెలంగాణ ఉద్యమంతో మమేకమై, ఉద్యమంలో ఒక కళాకారుడిగా తనదైన కీలక పాత్రవహించిన రమణారెడ్డి, తన జర్మనీ పౌరసత్వాన్ని కూడా వదులుకొని తన ప్రాంత కళారంగంకోసం శ్రమించడం అభినందనీయమని డా. జి. చిన్నారెడ్డి ప్రశంశించారు. రమణారెడ్డి కళారంగంలో నిర్వహించిన విశిష్ట కృషిని ముఖ్యమంత్రి ఎంతో కొనియాడారు. రమణారెడ్డి రూపొందించిన ప్రతిష్ఠాత్మక కళాకృతులు అమరవీరుల స్మారకం (అమరజ్యోతి), సెక్రటేరియట్ ఆవరణలో ఉన్న తెలంగాణతల్లి, రాజీవ్ గాంధీ విగ్రహాలు మరియు ఎన్నో కళాకృతులు రమణారెడ్డి రూపొందించినవే. ఈ పుస్తక రచయిత సీనియర్ పాత్రికేయుడు వున్నా కృష్ణమూర్తి.

## అందరి సహకారంతో జంగమ్మెట్ అభివృద్ధికి కృషి

**- డిప్యూటీ కమిషనర్ నాగమణి**



**చాంద్రాయణగుట్ట, జనవరి 2 ప్రభాతవార్త :** సర్కిల్ పరిధిలోని ప్రజా ప్రతినిధుల, ప్రజల సహకారంతో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని జీహెచ్ఎంసి జంగమ్మెట్ సర్కిల్ (24) తొలి డిప్యూటీ కమిషనర్ ఎ.నాగమణి తెలిపారు. శుక్రవారం ఆమె ప్రభాతవార్తతో మాట్లాడుతూ ..జీహెచ్ఎంసి పునర్విభజన తరువాత కొత్తగా ఏర్పడిన రాజేంద్రనగర్ జోన్లో జంగమ్మెట్ సర్కిల్‌ను నూతనంగా ఏర్పాటు చేశారన్నారు. సర్కిల్ పరిధిలోకి రియాసత్‌నగర్, లలితాబాగ్, జంగమ్మెట్, ఫూల్‌బాగ్, ఖాద్రిచమన్ డివిజన్లు వస్తాయని వివరించారు. జంగమ్మెట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని జంగమ్మెట్ వార్డు కార్యాలయం పక్కన గల జీహెచ్ఎంసి కొత్త భవనంలో సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే కొంత మంది అధికారులు విధుల్లో చేరారని, ప్రస్తుతం పాలన గాడిలో పడుతున్నట్లు పేర్కొన్నారు. కొత్త సర్కిల్లో త్వరలో పూర్తిస్థాయిలో పనులు పుంజుకుంటాయన్నారు.

# రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన ఉండాలి : ఎసిపి శ్రీనివాస్

**-రాజేంద్రనగర్ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలు**



**అత్తాపూర్ జనవరి 2,ప్రభాతవార్త :** రోడ్డు భద్రతపై ఆర్టీసి డ్రైవర్లు,ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాజేంద్రనగర్ ఎసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు.రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపోలో మేనేజర్ కృష్ణా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎసిపి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు...ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్త వహించాలన్నారు.పూర్తి ఏకాగ్రతతో ఎదుటి వాహనాలను రోడ్డుట్రాఫిక్‌ను పాదచారులను దృష్టిలో ఉంచుకొని బస్సులు నడపాలన్నారు.హైదరాబాద్ లాంటి మహానగరంలో సుమారు 80,90 మంది ప్రయాణికులతో సీటి బస్సులు నడపడం డ్రైవర్ల ప్రతిభకు నిదర్శనమన్నారు.డ్యూటీ అనంతరం రోడ్డు భద్రతకు సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌ను డ్రైవర్‌ల నుంచి ప్రతి రోజు తీసుకొని సమీక్షించాలని అధికారులకు సూచించారు.అనంతరం రాజేంద్రనగర్ క్రైమ్ సీఐ నవీన్ మాట్లాడుతూ...ఆర్టీసి సిబ్బంది రోడ్డు భద్రతనే ధ్యేయంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తవహించాలన్నారు.డ్రైవర్లు డ్యూటీ ప్రారంభమయ్యే ముందు తమ కుటుంబ సభ్యులను గుర్తుంచుకొని జాగ్రత్తగా నడపాలన్నారు.ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణకాంత్ మాట్లాడుతూ...ఆర్టీసి డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తూ,చ తప్పకుండా పాటించాలని ప్రమాదాలను నివారించాలన్నారు.డిపో మేనేజన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ...డిపోలో ప్రతి రోజు 130 బస్సులతో 39వేల కిలోమీటర్లు నడిపిస్తునామన్నారు.గత 9 నెలలుగా అతితక్కువ యాక్సిడెంట్ రేట్‌తో డిపో బస్సులను డ్రైవర్లు నడిపిస్తూన్నారని కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన ఈ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డుభద్రతను ఒక జీవన విధానంగా పాటించి ప్రమాద రహిత డిపోగా రాజేంద్రనగర్ డిపోను నిలపాలని డ్రైవర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో సుశీల,సూపరింటెండెంట్ బిఎస్ రెడ్డి,ఎంటి నాగేశ్వర్ రావు, కంట్రోలర్ మహ్మద్ అలీ,రెండు వందల మంది డ్రైవర్లు, కండక్టర్లు,మెకానిక్‌లు,సూపర్‌వైజర్లు,తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాల్లోనే 'విద్య హక్కు చట్టం' తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నల్ల లక్ష్మణ్

**సైఫాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** ప్రస్తుతం జుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే 'విద్య హక్కు చట్టం' అమలు జరిగేలా బిల్లును ప్రవేశపెట్టి మోదించాలని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు, కార్పోరేట్ సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా ప్రవేశాలు కల్పించేందుకు వెంటనే చట్టం తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు అమలు కాకుండా ఉన్న అన్ని నిబంధనలను వెంటనే సవరించాలని, విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూలును అరికట్టాలని కోరారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తమ పిల్లలకు అత్యధిక పీజులు చెల్లించలేక ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలని, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రవేశానికి పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని, ఉద్యోగాలు సాధన కోసం కూడా ఉచితంగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బహుజన ప్రజాశక్తి రాష్ట్ర నాయకులు విష్ణు, మీసాల అనిల్, నర్సింగ్‌రావు, మాగ్బుల్, మహేష్, రాజు, శివ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరికీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండాలి : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ




దృష్టిలోప విద్యార్థులకు డిజిటల్‌గైడ్ డివైజ్‌ను అందజేసిన గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, దానకిషోర్, డా. విజయభాస్కర్, ఓ.ఎస్.రెడ్డి తదితర అతిథులు

**రవీంద్రభారతి, జనవరి 2 ప్రభాతవార్త :** దృష్టిలోపం ఉన్న విద్యార్థులతోపాటు అందరు విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండాలని తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో సాధికారత కల్పించే లక్ష్యంతో మన అమెరికా తెలుగు అసోసియేషన్ (మాటా), రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ సౌజన్యంతో గవర్నరు దృష్టిలోపం ఉన్న పిల్లల కోసం డిజిటల్ గైడ్ డివైజ్‌ను విడుదల చేసి వందమందికి అందజేశారు. సౌజన్య సంస్థల సమాజసేవను ఎంతగానో కొనియాడుతూ మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన మన అమెరికా తెలుగు అసోసియేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దానకిషోర్, ఓ.ఎస్.రెడ్డి, భవాని శంకర్, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డా. బి.విజయభాస్కర్, కిరణ్, శ్రీధర్, శేఖర్ తదితర ప్రముఖులు, 400మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రామమందిరంలో లక్ష్మణ్ రావు గుప్త పూజలు



**బేగంబజార్,జనవరి 2 ప్రభాతవార్త:**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గౌలిగూడ రామ మందిరంలో తెలంగాణ బజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావుగుప్త ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలు అందరు సుఖసంతోషాలతో ఉండాలని దేవుని కోరినట్లు చెప్పారు.కార్యక్రమంలో సేనా ప్రతినిధులు రాజుయాదవ్,కిరణ్,దిక్షా పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్,స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

**నిజాంపేట్, జనవరి 2, ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిజాంపేట యందు ప్రణీత్ గ్రూప్ వారి అన్నపూర్ణమ్మ ట్రస్ట్ ద్వారా 850 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూ సాక్స్, స్కూల్ బ్యాగ్స్‌ను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ప్రణీత్ గ్రూప్ అధినేత నరేంద్ర కుమార్ మాట్లాడుతూ తానుఅంచెలంచెలుగా ఎదుగుతూ సమాజానికి సహాయం చేయాలనే తలంపుతో ప్రభుత్వ పాఠశాలలోనీ విద్యార్థులకు మెరిట్స్ స్కాలర్‌షిప్స్ దుస్తులు, బహుమతులు అందజేయడం జరుగుతుందని, ఇప్పటికే బాచుపల్లి మండలంలోని బాచుపల్లి ఉన్నత పాఠశాలలో 550 మంది, 250 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ షూ సాక్స్ అందించడం జరిగిందని అన్నారు.ఇక నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కులకు పైగా మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి అన్నపూర్ణమ్మ ట్రస్ట్ ద్వారా తలా రూ.50,000 ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రణీత్ వారి అన్నపూర్ణమ్మ ట్రస్టు వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ ఉపాధ్యాయులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎంవీవీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్స్ వచ్చిన వ్యక్తిని గుర్రం కాలుతో మట్టడంతో మృతి

**చార్మినార్,జనవరి 2 ప్రభాతవార్త :**

ఫిట్స్ వచ్చిన ఓ వ్యక్తిని గుర్రం కాలుతో మట్టడంతో తీవ్ర గాయాలకు గురై ఆ వ్యక్తి మృతి చెందిన సంఘటన హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ ఆంజనేయుల కథనం ప్రకారం..చార్‌మహల్‌కు చెందిన ఆబేద్ అలీ (24) గుర్రాలు శాలలో పని చేస్తున్నాడు.శుక్రవారం మధ్యాహ్నం అబేద్ అలీ మూసాఖాద్రి దర్గా సమీపంలో ఉన్న గుర్రాలు శాలలో ఉన్నాడు.అబేద్ అలీ గుర్రంముందు ఉన్నాడు.ఆకస్మాత్తుగా అబేద్ అలీకి ఫిట్స్ వచ్చాయి.ఫిట్స్ రావటంతో అబేద్ అలీ గుర్రం ముందు పడి పోయి తన్నుకుంటున్నాడు.ఫిట్స్‌తో తన్నుకుంటున్న అబేద్ అలీని గుర్రం కాలుతో మట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబేద్ అలీ మృతి చెందాడు.ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కుత్బుల్లాపూర్ డివిజన్ బస్తీల పునర్విభజనపై సమగ్ర పరిశీలన అవసరం : నాగరాజు



జీడిమెట్ల సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మాకు వినతిపత్రం సమర్పిస్తున్న భారతీయ జనతాపార్టీ బిజెపి డివిజన్ అధ్యక్షులు కట్టా నాగరాజు,నాయకులు వసంత్, సుజాత,లక్ష్మి, మహేశ్వరి

**కుత్బుల్లాపూర్ జనవరి 2 ప్రభాతవార్త**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిలిమిటేషన్ గెజిట్ ప్రకారం 131 డివిజన్‌లో ఉన్న బస్తీలను మార్చిన అంశాలపై సమగ్ర పరిశీలన చేసిస్థానికులకు తగున్యాయం చేయాలని భారతీయ జనతాపార్టీ కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కట్టాకుమార్ విజ్ఞప్తిచేశారు. ఈమేరకు శుక్రవారం జీడిమెట్ల సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మాకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా కట్టా నాగరాజు మాట్లాడుతూ డిలిమిటేషన్ గెజిట్ ప్రకారం 131డివిజన్ పరిధిలో ఉండి 285 పద్మానగర్ డివిజన్‌లో కొనసాగాల్సిన కాలనీలను పొరపాటున 284 గణేష్‌నగర్ డివిజన్‌కు మార్చిన అంశంపై సమగ్ర పరిశీలన చేయాలన్నారు.కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు కట్టాకు మార్,నాయకులు వసంత్, సుజాత, లక్ష్మి, మహేశ్వరి పాల్గొన్నారు.

## అత్తలూరి విజయ లక్ష్మికి సాహితీ సామ్రాజ్ఞి బిరుదు ప్రధానం



అత్తలూరి విజయ లక్ష్మికి సాహితీ సామ్రాజ్ఞి బిరుదు ప్రధానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి జనవరి 2, ప్రభాతవార్త :** ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయ లక్ష్మి తన రచనా సాహిత్యంలో అభ్యుదయ భావాలు మానవతా విలువలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి అన్నారు. విజయలక్ష్మి బహుముఖీన ప్రజ్ఞ గురించి చెప్పారు. దమ్మున్న రచయిత్రి విజయ లక్ష్మి అన్నారు. శుక్రవారం వంశీ ఆర్ట్ థియేటర్స్, వంశీ కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయ లక్ష్మి కి రచనా వ్యాసంగం 50 ఏండ్ల ప్రస్థానంగా సాహితీ సామ్రాజ్ఞి బిరుదు ప్రధానోత్సవ సభ జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, సినీ దర్శకులు రేలంగి నరసింహ రావు, సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, పొత్తూరి జయ లక్ష్మీ నటి రాధా ప్రశాంతి,వాణి,జ్యోతి వలబోజు తదితరులు పాల్గొన్నారు.

## అంధులకు జ్ఞాన నేత్రం ఇచ్చిన లూయిస్ బ్రెయిలీ



ప్రసంగిస్తున్న సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ

**చిక్కడపల్లి జనవరి 2, ప్రభాతవార్త :**

అంధులు చదువుకోనేందుకు వీలుగా చుక్కల లిపి ని కనుగొని వారికి జ్ఞాన నేత్రం ఇచ్చిన లూయిస్ బ్రెయిలీ తర తరాలు గుర్తుండి పోతారని సి బి ఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా లూయిస్ బ్రెయిలీ యాది లో సంస్మరణ సమావేశం గానసభ నిర్వహణ లో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నాగ మారుతి శర్మ పాల్గొని మాట్లాడుతూ మూడేళ్ళ వయస్సు లో ప్రమాద వశాత్తూ కళ్ళు కోల్పోయిన బ్రెయిలీ నిరాశ చెందక పట్టుదలతో చదువు కొని తన లా అంధులు చదువుకు దూరం కావొద్దు అని విశేష పరిశోధన లు చేసి బ్రెయిలీ లిపి కనుగొన్న మానవతా మూర్తి అని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై జాతీయ వికలాంగులు హక్కుల సంఘం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర రావు కాంగ్రెస్ పార్టీ నేత శ్రీమణి ఆధ్యాత్మిక వేత్త శ్యామ్ సుందర్ మల్లెపూల వెంకటరమణ పాల్గొన్నారు

